## విధుల్లోకి కొత్త తహసీల్దార్లు

అన్నపురెడ్డిపల్లి/ములకలపల్లి/టేకులపల్లి/దమ్మపేట/జూలూరుపాడు/కొత్తగూడెం టౌన్/అశ్వారావుపేట/మణుగూరు టౌన్/బూర్గంపహాడ్ , మే 19: జిల్లాలోని కొన్ని మండలాల తహసీల్దారులు బదిలీ అయ్యారు. కొత్తగా వచ్చిన వారు సోమవారం విధుల్లో చేరారు. అన్నపురెడ్డిపల్లి తహసీల్దారుగా ములకలపల్లి నుంచి జి.పుల్లారావు వచ్చారు. అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ బదిలీపై భద్రాచలం వెళ్లారు. ములకలపల్లి తహసీల్దారుగా బి.గన్యానాయక్ వచ్చారు. ఈయన ఇప్పటివరకూ భద్రాచలం ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పనిచేశారు. టేకులపల్లి తహసీల్దారుగా మహబూబాబాద్ డీటీ పి.ముత్తయ్య వచ్చారు. టేకులపల్లి తహసీల్దార్ నాగభవాని మహబూబాబాద్ వెళ్లారు. దమ్మపేట తహసీల్దారుగా భగవాన్ రెడ్డి వచ్చారు. జూలూరుపాడు తహసీల్దారుగా భద్రాచలం నుంచి శ్రీనివాస్ వచ్చారు. జూలూరుపాడు తహసీల్దార్ స్వాతిబిందు బదిలీపై కలెక్టరేట్‌కు వెళ్లారు. సుజాతనగర్ తహహసీల్దారుగా అశ్వారావుపేట నుంచి వనం కృష్ణప్రసాద్ వచ్చారు. సుజాతనగర్ తహసీల్దార్ శిరీష బూర్గంపాడు వెళ్లారు. అశ్వారావుపేట తహసీల్దార్‌గా ఎల్.వీరభద్రం నియమితులయ్యారు. మణుగూరు తహసీల్దార్‌గా అద్దంకి నరేష్ బాధ్యతలు చేపట్టారు. బూర్గంపహాడ్ తహసీల్దార్‌గా శిరష బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ముజాహిద్ కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో పాల్వంచ తహసీల్దార్ వివేక్ బాధ్యతలు చేపట్టారు. అయితే నాలుగు రోజుల వ్యవధిలోనే బదిలీ కావడంతో ఆయన స్థానంలో సుజాత్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శిరీష సోమవారం బాధ్యతలు చేపట్టారు.

## 'ఆయిల్ పాంపై తప్పుడు ప్రచారం సరికాదు'

దమ్మపేట, మే 19: ఆయిల్‌పాం సాగులో స్వల్పంగా కనిపిస్తున్న హాఫ్ టైప్ మొక్కలపై కొందరు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని ఆయిల్‌ఫెడ్, పామాయిల్ రైతు సంఘం నాయకులు అన్నారు. మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. హాఫ్ టైప్ సమస్య నివారణకు నర్సరీ దశలోనే చర్యలు తీసుకుంటామన్నట్లు చెప్పారు. దీనిపై రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నా. ఒకటీ రెండు శాతం మొక్కల్లో హాఫ్ టైప్ (కల్లింగ్ మొక్కలు) కనిపించడం సాధారణమేనని అన్నారు. నర్సరీ స్థాయిలోనే ఈ మొక్కలను తొలగించి, రైతులకు నాణ్యమైన మొక్కలే పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఆయిల్‌ఫెడ్‌పై తమకు నమ్మకం ఉందన్నారు. తమకు నాణ్యమైన మొక్కలే అందాయని, ఒకటీ రెండు శాతం హాఫ్ టైప్ మొక్కలు రావడం సహజమేనని చెప్పారు. రాష్ట్ర పామాయిల్ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార కిట్లు పంపిణీ



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న మండల వైద్యాధికారిణి సంకీర్తన

అశ్వాపురం, మే 19: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని క్షయ బాధితులకు సోమవారం మండల వైద్యాధికారి సంకీర్తన ఆధ్వర్యంలో ఆరోగ్యకేంద్రంలో పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. టీబీని సకాలంలో గుర్తించి మందులు వాడితే పూర్తిగా నయమయ్యే అవకాశం ఉంటుందని, సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఉచిత మందులతో పాటు ఆరునెలల పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్షయ సూపర్‌వైజర్ రాజు, వైద్యసిబ్బంది పద్మ, పుష్పావతి పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణ.. అందరి బాధ్యత



మొక్క నాటుతున్న రాజేశ్వర్ రావు

లక్ష్మీదేవిపల్లి, మే 19: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని గ్రీన్ ఇండియా చాలెంజ్ సభ్యుడు చెప్యాల రాజేశ్వర రావు అన్నారు. ఆయన సోమవారం సాయంత్రం భద్రాచలం రామయ్యను దర్శించుకున్నారు. అనంతరం, లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామంలోని బీఆర్‌ఎస్‌వీ నాయకుడు సంగం శివ గృహంలో తేనీరు సేవించి మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కన్వీనర్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడాన్ని యజ్ఞంలాగా చేపట్టామన్నారు. బీఆర్‌ఎస్‌ఎస్‌వీ నాయకులు భద్రం శ్రీరామ్, నిరంజన్, రవి, నరేష్, ప్రవీణ్, వంశీ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫాం పాండ్‌తో నీటి సంరక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

దమ్మపేట, మే 19: రైతులు తమ సాగు భూముల్లో ఫాం పాండ్ నిర్మించుకోవడం ద్వారా భూగర్భ నీటిని సంరక్షించుకోవచ్చని, అన్ని కాలాల్లో సాగు సమస్య నుంచి బయటపడవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఐవి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ టి.శ్రావణ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కె.రవికుమార్ చెప్పారు. వారు సోమవారం మండలంలోని అంకపాలెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులంతా వానాకాలం పంట సాగుకు సమాయత్తం కావాలన్నారు. నేలలో పచ్చిరొట్ట పైర్లు కలియదున్నితే సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని చెప్పారు. మునగ సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చన్నా. కార్యక్రమంలో దమ్మపేట మండల ఉద్యాన వన అధికారి కె.సందీప్, మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అడవి రామవరం గ్రామ అభివృద్ధికి కృషి చేసిన ఎస్పీ



సెల్ టవర్, కమ్యూనిటీ హాల్ వద్ద గుండాల సీఐ రవీందర్, పోలీసులు, గ్రామస్తులు

గుండాల, మే 19: అడవిరామవరం గ్రామ అభివృద్ధికి కృషి చేసిన ఎస్పీ రోహిత్ రాజుకు ఆ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి వివరాలు.. మూల నెలల క్రితం గుండాల పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవిరామవరం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్యాంప్‌కు ముఖ్యఅతిథిగా ఎస్పీ గ్రామానికి వచ్చారు. ఆయన గ్రామం మొత్తం కలియ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఎస్ఎన్ఎల్ టవర్ ఉన్నప్పటికీ సిగ్నల్ రావట్లేదని ప్రజలు తెలపడంతో అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని వారికి ఆ రోజు హామీ ఇచ్చారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ఎస్పీ బీఎస్ఎన్ఎల్ అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని వారికి తెలిపారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు సమస్యను పరిష్కరించి మొబైల్ ఫోన్ నెట్ వర్క్ వచ్చేలా చేశారు. సోమవారం గుండాల సీఐ రవీందర్ గొత్తికోయ అడవి రామవరం గ్రామం సందర్శించగా వారి ద్వారా ఎస్పీ రోహిత్ రాజ్‌కు గ్రామప్రజలు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. గ్రామంలో కమ్యునిటీహాల్ పూర్తి చేసి గ్రామస్తులకు అప్పగించారు.

# సుందరయ్యకు నివాళి



భద్రాచలం : నివాళులర్పిస్తున్న నాయకులు



దుమ్ముగూడెం : సుందరయ్య వర్ధంతిలో నేతలు

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం నాయకులు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండలాల్లో సుందరయ్య స్థూపం వద్ద, చిత్రపటాలకు, విగ్రహాలకు పార్టీ నాయకలు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అరుణ పతాలకాలను ఎగురవేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. సుందరయ్య జీవితం నేటి తరానికి, రాబోవు తరాలకు ఆదర్శమన్నారు. సుందరయ్య జీవితం ఒక కమ్యూనిస్టులకే కాకుండా అన్ని రంగాల ప్రజలకు ఎంతో స్పూర్తిదాయకమని కొనియాడారు.

– నమస్తే నెట్‌వర్క్

# అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలకు వినతి



డీడబ్ల్యూవోకు వినతిపత్రం ఇస్తున్న సూపర్‌వైజర్లు

టేకులపల్లి, మే 19: కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన టేకులపల్లి అంగన్‌వాడీ టీచర్ భద్రమ్మపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సోమవారం డీడబ్ల్యూవో స్వర్ణలత లెనినాకు ఆమె కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న భద్రమ్మను సంబంధిత సిబ్బంది మందలించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె కక్షపూరితంగా ఐసీడీఎస్ సిబ్బందిపై కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని వివరించారు. సూపర్‌వైజర్లు కె.అనురాధ, లక్ష్మి, విజయకుమారి, నిర్మల, యశోద, ఖలీదాబేగం, స్వరాజ్యలక్ష్మి, పుష్పవతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. టేకులపల్లి అంగన్‌వాడీ సెంటర్‌ను డీడబ్ల్యూవో స్వర్ణలత లెనినా, సీడీపీవో తార సోమవారం సందర్శించారు. అక్కడి టీచర్ భద్రమ్మతో మాట్లాడారు.

## బ్రహ్మసూత్ర శివలింగ ప్రతిష్ట



ప్రతిష్ట నిర్వహిస్తున్న వేదపండితులు

దుమ్ముగూడెం, మే 19: మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలోని చిన్న అరుణాచలం(ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం)లో వైశాఖ మాసం పంచమతి సోమవారం శ్రవణా నక్షత్రంలో 1008 బ్రహ్మసూత్ర శివలింగాలను, 9 అడుగుల బాణలింగాన్ని బ్రహ్మాండంగా ప్రతిష్టింపజేశారు. ఈ ప్రతిష్టా కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న ఇసుక లారీ
### ఇద్దరి మృతి.. 20 మందికి గాయాలు

అశ్వాపురం, మే 19: ఆగివున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరి మృతి చెందగా, 20 మందికి గాయాలైన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం మండలం సీతారాంపురం గ్రామం నుంచి మేడారం సమ్మక్క–సారలమ్మ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. తాడ్వాయి సమీపంలో మంచినీళ్లు తాగేందుకు ట్రాక్టర్‌ను రోడ్డుపక్కన నిలిపారు. రాత్రి పూట కావడంతో ట్రాక్టర్‌ను గమనించలేకపోయిన ఇసుక లారీ డ్రైవర్ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న నూప దుర్గ (40), చెట్టుపల్లి సీత(39) ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను వైద్యం కోసం ములుగు ఆసుపత్రికి తరలించారు. ఒకే ఊరికి చెందిన ఇద్దరు మహిళలు మృతిచెందడంతో సీతారాంపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సోషల్ మీడియా అధ్యక్షునిగా లోహిత్




రేగా కాంతారావును కలిసి కృతజ్ఞతలు తెలిపిన లోహిత్

అశ్వాపురం, మే 19: బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షునిగా గజ్జి లోహిత్ యాదవ్‌ను నియమించినట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును లోహిత్‌తో పాటు ఆయన మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ సౌకర్యం, బస్టాప్ ఏర్పాటు చేయాలి

అశ్వాపురం, మే 19: మండల పరిధిలోని మొండికుంట ప్రధాన రహదారి వెంట మల్లెలమడుగు పంచాయతీ పరిధిలో ఉన్న చింతకుంట గ్రామానికి విద్యుత్ సౌకర్యంతో పాటు ఆర్టీసీ బస్సులు ఆపేవిధంగా రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను పీవోడబ్ల్యు జిల్లా నాయకురాలు పెదగోని ఆదిలక్ష్మి చింతకుంట గ్రామస్తులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదిలక్ష్మి గ్రామస్తులు

## రక్తదాన శిబిరం

కొత్తగూడెం అర్బన్, మే 19: కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని శారద విద్యాలయంలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపును యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సోమవారం నిర్వహించింది. దీనిని ఎంపీఐ సంగం వెంకటపుల్లయ్య ప్రారంభించారు. క్లబ్ ఫౌండర్ జేబీ బాబు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇనుప పైపుల చోరీపై కేసు

టేకులపల్లి, మే 19: మండలంలోని బేతంపూడి దర్గా వద్ద ఆర్‌టీఎల్‌ఐఎస్ పైపులు చోరీ అయ్యాయి. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎరిండ్ల నాగయ్య ఫిర్యాదుతో ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేశారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం

అశ్వారావుపేట, మే 19: మండలంలోని గుమ్మడవల్లి గ్రామంలో సోమవారం క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను బీఆర్ఎస్ నాయకురాలు వగ్గెల పూజ, నారాయణపురం సొసైటీ డైరెక్టర్ పుట్టా సత్యం ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు చందా లక్ష్మీనర్సు, మందపాటి రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుంటల పరిశీలన

పాల్వంచ రూరల్, మే 19: మండలంలోని తోగ్గూడెంలో నీటి కుంటల నిర్మాణాన్ని ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఏపీవో రంగా, ఏఏవో సత్యం, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ షాపు దగ్ధం

ఇల్లెందు, మే 19: ఇల్లెందులోని ఆదిత్య ఫెర్టిలైజర్ షాపు సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. షాప్ యజమాని నాగేశ్వరరావు తెలిపిన వివరాలు.. జగాదంబ సెంటర్‌లోని ఆదిత్య ఫెర్టిలైజర్ షాపను రోజులాగే ఆదివారం సాయంత్రం మూసివేసి ఇంటికి వెళ్లారు. షాపు నుంచి మంటలు వస్తున్నాయంటూ చుట్టుపక్కల వారు అర్ధరాత్రి 12 గంటల సమయంలో యజమానికి ఫోన్ చేసి చెప్పారు. ఆయన ఇచ్చిన సమాచారంతో ఫైర్ సిబ్బంది వచ్చారు. అప్పటికే షాపులోని నిల్వలు చాలా వరకు దగ్ధమయ్యాయి.

## ఈతకెళ్లి బాలుడు మృతి

లక్ష్మీదేవిపల్లి, మే 19: బాలుడి ఈత సరదా.. అతడి ప్రాణాన్ని బలిగొంది. కొత్తగూడెం పట్టణం న్యూగొల్లగూడేనికి చెందిన తొమ్మదోతరగతి విద్యార్థి మేరీ చంద్రశేఖర్(15), ముర్రేడు వాగులో సరదాగా ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. ఈత కోసం దిగిన ప్రదేశం లోతుగా ఉండడంతో చంద్రశేఖర్ నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని లక్ష్మీదేవిపల్లి పోలీసులు బయటకు తీయించి, ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 19: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడామండపంలో నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అన్నదానానికి రూ.లక్ష వితరణ



అన్నదానానికి వితరణ ఇస్తున్న భక్తులు

భద్రాచలం, మే 19: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో అన్నదానం నిమిత్తం వరంగల్‌కు చెందిన రామవీరాస్వామి, విమల దంపతులు రూ.100116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### రామయ్యకు వెండి అభిషేకం జల్లెడ వితరణ

భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి కొత్తగూడెనికి చెందిన కమలమ్మ రూ.50వేల విలువైన వెండి అభిషేకం జల్లెడను వితరణగా అందజేశారు. అనంతరం ఆమెకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## వంద రోజుల 'విద్యుత్' సంబురం



కేక్ కట్ చేస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ, మే 19: కేటీపీఎస్ ఐదవ దశ పదో యూనిట్‌లో 250 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిరాటంకంగా 103 రోజులపాటు కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది సోమవారం సంబురాలు జరుపుకున్నారు. కేటీపీఎస్ 5,6 దశల సీఈ ప్రభాకర్‌రావు కేక్ కట్ చేశారు. ఎస్ఈలు సత్యనారాయణ, ధర్మారావు, మోక్షవీర్, డీఈలు ఏడీలు, కార్మిక నాయకులు, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ సందర్శన

లక్ష్మీదేవిపల్లి, మే 19: మండలంలోని రేగళ్ల పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులను, మందుల నిల్వను, ల్యాబ్ రూమును, వార్డులను పరిశీలించారు. పరిశీలించారు. డాక్టర్లతో, సిబ్బందితో మాట్లాడారు.

## రెస్క్యూ స్టేషన్ సందర్శించిన ఎస్పీ



ఎస్పీని సన్మానిస్తున్న కోటిరెడ్డి

రామవరం, మే 19: కొత్తగూడెం మైన్స్ రెస్క్యూ స్టేషన్‌ను ఎస్పీ రోహిత్‌రాజ్ సోమవారం సందర్శించారు. ఎక్విప్‌మెంట్ వివరాలు, రక్షణ చర్యలు తదితరాంశాలను స్టేషన్ ఇన్‌చార్జ్ అనంతరామయ్య నుంచి తెలుసుకున్నారు. ఎస్పీని ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి సన్మానించారు. డీఎస్పీ రహమాన్, సీఐ రమేష్‌కుమార్, ఎస్టేట్ ఆఫీసర్ తౌరియా తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ వాకర్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన వాకర్స్ క్లబ్ కమిటీ సభ్యులు

మణుగూరు టౌన్, మే 19: మణుగూరు పట్టణంలోని నేతాజీ వాకర్స్ క్లబ్ నూతన కమిటీని సోమవారం ఆ క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా సామ శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రావులపల్లి రామ్మూర్తి, కోశాధికారిగా వడ్డానం రమేష్, ముఖ్య సలహాదారులుగా ఎన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, పుచ్చకాయల శంకర్, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, కటకం సతీష్‌ను ఏకగ్రీవగంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గోల్డ్‌షాపు శంకర్, వెంకటేశ్వర్లు, రామ్‌రెడ్డి, శేషగిరిరావు, తిరుపతిరావు, శంకర్‌రెడ్డి, సంతోష్, రవీందర్ నాయక్, రమేష్, రాంజేంద్రప్రసాద్, శ్రీనివాసరావు, రవి, వినీల్, భద్రనాయక్, బిఎస్ఎన్ఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా కరకగూడెం అధ్యక్షుడిగా సునిల్



కరకగూడెం, మే 19: కరకగూడెం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడిగా సిద్ది సునిల్‌ను సోమవారం పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పార్టీ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రేగా సూచించారు. సునిల్ మాట్లాడుతూ.. తనను నమ్మి ఇంతటి బాధ్యత కట్టబెట్టిందుకు పార్టీకి, జిల్లా అధ్యక్షుడు రేగాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లకు వీడ్కోలు



పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

మణుగూరు టౌన్, మే 19: బదిలీపై వెళ్తున్న పలువురు కానిస్టేబుళ్లకు మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పోలీసులు వీడ్కోలు పలికారు. బదిలీ అయిన సీనియర్ కానిస్టేబుల్ కన్నయ్య దొర, కానిస్టేబుల్ రవీందర్, రాథోడ్ బిక్కోజి, షమీం, సనయ్‌ను ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మేడా ప్రసాద్ సన్మానించి వీడ్కోలు పలికారు.

జూలూరుపాడు, మే 19: స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అజ్మీర బుచ్చయ్య నాయక్, కానిస్టేబుళ్లు శైలజ, సౌజన్య బదిలీ అయ్యారు. వారిని సోమవారం స్టేషన్‌లో ఎస్సై బదావత్ రవి, సిబ్బంది సన్మానించారు.

అశ్వాపురం, మే 19: కొంతకాలంగా అశ్వాపురం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పోలీసు కానిస్టేబుల్ శ్రీదేవి, ఎర్రయ్య, నర్సింహారావుకు సోమవారం సీఐ అశోక్‌రెడ్డి స్టేషన్ సిబ్బందితో కలిసి సన్మానం చేసి వీడ్కోలు పలికారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**CHANGE OF NAME**

★I, **VIPPARLA KALYANI** W/o **VIPPARLA KIRAN KUMAR** (OLD NAME) R/O.4-3-53, RAM NAGAR, KOTHAGUDEM TOWN AND MANDAL, BHADRADRI KOTHAGUDEM DIST, 507101. I, HAVE CHANGED MY NAME AS **TURUMELLA KALYANI** W/O **VIPPARLA KIRAN KUMAR** (NEW NAME), FOR ALL PUPOSE.
KMM

**WANTED**

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616